## యథావిధిగా ప్రజావాణి

కామారెడ్డి, జూన్ 9 : ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ నెల 10వ తేదీ నుంచి యథావిధిగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమం సోమవారం నుంచి తిరిగి యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను లేదా సమస్యలను నేరుగా ప్రజావాణిలో అందజేయవచ్చని పేర్కొన్నారు.

## నేటి నుంచి ప్రభుత్వ ఉర్దూ కళాశాలలో రోగులకు వైద్య సేవలు

బాన్సువాడ, జూన్ 9 : బాన్సువాడ పట్టణంలోని ప్రభుత్వ ఏరియా దవాఖాన ప్రస్తుత భవనం శిథిలావస్థకు చేరుకున్నది. నూతన భవన నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వం 37 కోట్ల 50 లక్షల రూపాయల నిధులను మంజూరు చేసింది. నూతన భవన నిర్మాణం చేపట్టేందుకు ప్రస్తుతం ఉన్న ఏరియా దవాఖాన భవనాన్ని కూల్చివేస్తున్నారు. ఏరియా దవాఖానలో అందుతున్న వైద్య సేవలను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మాతా శిశు ఆరోగ్య కేంద్రం (ఎంసీహెచ్ )తోపాటు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉర్దూ మీడియం భవనంలో నేటి నుంచి సేవలు ప్రారంభిస్తున్నట్లు దవాఖాన సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస్‌ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మాతా శిశు దవాఖానలో డయాలసిస్, ఫార్మసీ, అన్ని రకాల అవుట్ పేషెంట్, ల్యాబ్, ఎక్స్‌రే సేవలు, కిచెన్‌ను నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉర్దూ మీడియం భవనంలో ఇన్ పేషెంట్ విభాగం(పురుషులు, స్త్రీలకు) ఏఆర్‌టీ సేవలు అందిస్తారని తెలిపారు. ఏరియా దవాఖాన పాత భవనంలో పోస్టుమార్టం, లాండ్రీ సేవలు అందిస్తారని తెలిపారు. ఆయా చికిత్సల కోసం దవాఖానకు వచ్చే రోగులు గమనించాలని ఆయన సూచించారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

భిక్కనూరు, జూన్ 9 : భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. 2003-04 సంవత్సరానికి చెందిన పదో తరగతి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు 20 ఏండ్ల తర్వాత ఒకే వేదికపై చేరుకొని తమ అనుభూతులను పంచుకున్నారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను శాలువా కప్పి ఘనంగా సత్కరించారు.

## రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

భిక్కనూరు, జూన్ 9 : మండలంలోని అంతంపల్లి గ్రామానికి చెందిన యువకుడిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతిచెందిన ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలంలోని రెడ్డి పల్లి కాలనీ వద్ద శనివారం రాత్రి చోటు చేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. భిక్కనూరు మండలం అంతంపల్లి గ్రామానికి చెందిన పిట్ల కుమారస్వామి(32) చేగుంట మండలం పెద్ద శివనూర్‌లో నిర్వహించిన దశ దిన కర్మకు వెళ్లాడు. తిరిగి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తుండగా రెడ్డిపల్లి కాలనీ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో కుమారస్వామి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం స్వగ్రామం అంతంపల్లిలో కుమార స్వామి అంత్యక్రియలు నిర్వహించారు.

# మంజీరలో మృత్యుఘోష

■ ఇష్టారీతిన ఇసుక తవ్వకాలు ■ ప్రమాదకరంగా మారిన గుంతలు ■ పట్టించుకోని సంబంధిత అధికారులు

బాన్సువాడ, జూన్ 9: మంజీరానది ప్రమాదాలకు నిలయంగా మారింది. ప్రతిఏటా ప్రమాదాలు చోటుచేసుకోవడం ఆందోళనకు గురిచేస్తోంది. మంజీరా పరీవాహక ప్రాంతంలో ఇసుక కోసం తవ్విన గుంతలు ప్రజలు ప్రాణాలను నీటిలో కలిపేస్తున్నాయి. ముఖ్యంగా మంజీరాలో సేద తీరేందుకు లేక ఇతరాత్ర పుణ్యకార్యాల కోసం వచ్చేవారు స్నానాల కోసం నీటి గుంతల్లో దిగి మృత్యువాత పడుతున్నారు. ఇసుక క్వారీలకు అధికారులు కొంత పరిధి వరకు అనుమతి ఇచ్చినప్పటికీ.. రాత్రివేళలో కొందరు అక్రమార్కులు సన్న ఇసుకను చూసి లోతుగా తవ్వి ట్రాక్టర్లు, లారీల ద్వారా తరలిస్తున్నారు. తవ్విన గుంతలను అలాగే వదిలేయడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇసుక మేటలను తొలగించి భూమిని చదును చేస్తామంటూ కొందరు వ్యాపారులు.. ఉదయం, రాత్రివేళల్లో మంజీర నుంచి లోతుగా తవ్వి ఇసుకను తరలిస్తున్నారు. దీంతో మంజీరాలోకి స్నానాలకు వెళ్లిన వారు లోతు తెలియక అందులో పడి మృతి చెందుతున్నారు.

**పదుల సంఖ్యలో పర్మిషన్.. వందల సంఖ్యలో లారీలు**

ఇసుకను తీసుకెళ్లడానికి అధికారులు పదుల సంఖ్యలో అనుమతులు ఇచ్చినప్పటికీ వాస్తవపరిస్థితి ఇందుకు భిన్నంగా ఉన్నది. పదుల సంఖ్యలో పర్మిషన్ తీసుకొని వందల సంఖ్యలో లారీల్లో ఇసుకను తరలిస్తున్నారు. అసలు ఎన్ని క్యూబిక్ మీటర్ల వరకు ఇసుకను తవ్వేందుకు అధికారులు పర్మిషన్ ఇస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇంకా ఎన్నిరోజులు అనుమతులు కొనసాగుతున్నాయని మండిపడుతున్నారు.



మంజీర పరీవాహక ప్రాంతం

**పలువురు మృత్యువాత**

మంజీరలో ఇసుక వ్యాపారులు అడ్డూఅదుపు లేకుండా లోతుగా ఇసుకను తవ్వి గుంతలు వదిలి వేస్తున్నారు. దీంతో రెండేండ్ల క్రితం చెట్లూర్ గ్రామానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు గుంతల్లో మునిగి మృత్యువాత పడ్డారు. ఇటీవల బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన ఇద్దరు గుంతలో స్నానానికి వెళ్లి నీట మునిగి ప్రాణాలు వదిలారు. ఇప్పటికైనా ఇసుక తవ్వకాలను సంబంధిత అధికా రులు నిలిపివేయించాలని స్థానికులు కోరుతున్నారు.



గుండారంలో నిర్వహించిన ఉత్సవాల్లో పాల్గొన్న గ్రామస్తులు

## కొనసాగుతున్న ఉత్సవాలు

రాజంపేట్, జూన్ 9 : మండలంలోని గుండారం గ్రామంలో మూడు రోజులపాటు గ్రామదేవతల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు మాజీ సర్పంచ్ ర్యాకం లక్ష్మణ్ తెలిపారు. ప్రతిఏటా వానకాలం పంటలు వేసే ముందు వర్షాలు సమృద్ధిగా కురిసి ప్రజలు సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని గ్రామ దేవతల ఉత్సవాలు నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో భాగంగా శనివారం ఎడ్లబండ్ల ప్రదర్శనతో ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం గ్రామదేవతలకు బోనాల సమర్పించామన్నారు. సోమవారం రథం ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బండారి సిద్ధారెడ్డి, బీమరి శ్యామయ్య, నారాగౌడ్, వెంకట్‌గౌడ్, సాయాగౌడ్, ప్రవీణ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్నికి ఆహుతి

**దగ్ధమైన ఎవెన్యూ ప్లాంటేషన్ చెట్లు**

బాన్సువాడ రూరల్, జూన్ 9 : రాష్ట్రంలో పచ్చదనాన్ని పెంచేందుకు ప్రభుత్వాలు మొక్కల పెంపకానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తుంటే కొందరి రైతుల నిర్లక్ష్యంతో ఏండ్ల తరబడి పెంచిన చెట్లు అగ్నికి ఆహుతి అవుతున్నాయి. బాన్సువాడ మండలంలోని కోనాపూర్ గ్రామ చెరువు కట్టపై గతంలో నాటిన మొక్కలు ఏపుగా పెరిగి ఆహ్లాదకరంగా కనిపిస్తుండేవి. కొందరు రైతులు పెట్టిన నిప్పుతో చెట్లు దగ్ధమైపోయాయి. ఇక్కడ నాటిన మొక్కలు పెద్దగా పెరిగి చెరువు కట్టకు వన్నె తెచ్చాయి. ఆహ్లాదకరంగా, చెరువు కట్టకు అందాన్ని తెచ్చిన మొక్కలు కాలిపోవడంతో గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులు వరి కొయ్యలకు నిప్పు పెట్టేటప్పుడు రోడ్డు పక్కన నాటిన మొక్కలు కాలిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నారు.



కోనాపూర్ ప్రధాన రహదారి పక్కన చెరువు కట్టపై అగ్నికి ఆహుతైన చెట్లు

## 14న జాబ్ మేళా

కామారెడ్డి, జూన్ 9 : ఈ నెల 14న జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియెట్ నోడల్ అధికారి షేక్ సలాం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి జిల్లాలో సాఫ్ట్‌వేర్ రంగంలో హెచ్‌సీఎల్ టెక్ వారు నిర్వహిస్తున్న టెక్ బీ ప్రోగ్రాం కోసం సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్, గ్రూప్‌లతో 2024లో ఇంటర్ పూర్తిచేసుకున్న విద్యార్థులకు శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ రంగ, ప్రైవేట్ కళాశాలలో 2024లో పూర్తి చేసుకున్న హెచ్‌ఈసీ, సీఈసీ, ఒకేషనల్ కోర్సుల్లో 75 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని తెలిపారు. పదో తరగతి పాస్ సర్టిఫికెట్, ఇంటర్మీడియెట్ పాస్ ఆన్‌లైన్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఒక ఫొటో, ఆండ్రాయిడ్ మొబైల్‌తో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8074065803 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి, జూన్ 9 : జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలికల కళాశాలలో బోధించేందుకు అర్హులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రణీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో మ్యాథ్స్, జువాలజీ సబ్జెక్ట్ బోధించేందుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 7995057920 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

**పాఠశాల, కళాశాలలో చేరేందుకు..**

కామారెడ్డి, జూన్ 9 : జిల్లా కేంద్రంలోని మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎం పీసీ, బైపీసీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రణీత ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు నేరుగా కళాశాలలో లేదా 7995057720 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## పట్టణాభివృద్ధికి ప్రజలు సహకరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

కామారెడ్డి, జూన్ 9 : పట్టణాభివృద్ధికి ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజారెడ్డి కల్యాణమండపంలో ఆదివారం కామారెడ్డి పట్టణ అభివృద్ధి కోసం వ్యాపారులు, ప్రజలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలంటే ప్రజలు, వ్యాపారులు భాగస్వాములు కావాలని అన్నారు. అప్పుడే కామారెడ్డి మరింత అభివృద్ధి చెందుతుందని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు, వ్యాపారులు పాల్గొన్నారు.

## కార్యకర్తలను గుర్తించకపోవడంతోనే మెజార్టీ తగ్గింది

**ఆత్మీయ సమ్మేళనంలో కాంగ్రెస్ నాయకుల ఆవేదన**



సమ్మేళనంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

రామారెడ్డి, జూన్ 9: కార్యకర్తలను గుర్తించకపోవడంతోనే ఇటీవల జరిగిన జహీరాబాద్ లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఎల్లారెడ్డి నియోజకవర్గంలో భారీగా మెజార్టీ తగ్గిందని స్థానిక నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. మండలంలోని పోసానిపేట గ్రామ శివారులో ఆదివారం పార్టీ కార్యకర్తలు, నాయకుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. సమావేశంలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో జరిగిన పోలింగ్ సరళిపై చర్చించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 24వేల మెజార్టీ రాగా లోక్‌సభ ఎన్నికల్లో 16వేలకు తగ్గిందని పలువురు నాయకులు తెలిపారు. మొత్తం 40వేల ఓటు బ్యాంకు తగ్గిందని, ఇందుకు బాధ్యులు ఎవరని ప్రశ్నించారు. కాంగ్రెస్ కార్యకర్తల్లో ఉన్న అసంతృప్తిని తొలగించాలని, పార్టీలో ఉన్నలోటుపాట్లను సరిచేసుకోవాలని, పీఏల పెత్తనంతో విసిగిపోతున్న కార్యకర్తలను రక్షించుకోవడంతోపాటు వారి సమస్యలను తెలుసుకోవడానికి ఈ ఆత్మీయ సమ్మేళనం ఎంతో దోహదపడిందని సీనియర్ నాయకులు తెలిపారు. సమ్మేళనంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, జడ్పీటీసీ నారెడ్డి మోహన్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు గీరెడ్డి మహేందర్‌రెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నర్సింగరావు, అంబాయి ప్రసాద్, మహేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ ప్రమాణ స్వీకారం.. బీజేపీ నేతల సంబురాలు

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 9: దేశప్రధానిగా నరేంద్ర మోదీ ఆదివారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఎల్లారెడ్డి పట్టణంలోని గాంధీచౌక్‌లో శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. వైస్ ఎంపీపీ పెద్దెడ్ల నర్సింహులు, మాజీ ఎంపీపీ నక్కగంగాధర్, నాయకులు ప్యాలాల రాములు, బత్తిని దేవేందర్, ఆకుల కిష్టయ్య, సతీశ్, గణేశ్, గజానంద్, బాల్‌రాజ్, వంగపల్లి కాశీనాథ్, పోచయ్య తదితరులున్నారు.



ఎల్లారెడ్డిలో సంబురాలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

# హరితహారం లక్ష్యం 1.16లక్షల మొక్కలు

- గ్రామాల్లోని నర్సరీల్లో సిద్ధం
- నాటేందుకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

పెద్దకొడప్‌గల్, జూన్ 9: రాష్ట్రాన్ని హరిత తెలంగాణగా మార్చేందుకు అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ హరితహారం కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా ప్రారంభించారు. నర్సరీల్లో మొక్కలను పెంచి ప్రతి వానకాలంలో ఖాళీ ప్రదేశాలు, రోడ్లకు ఇరువైపులా వాటిని నాటే కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపట్టారు. అప్పట్లో నాటిన మొక్కలు ఇప్పుడు ఏపుగా పెరిగి గ్రామాలకు శోభను తెచ్చిపెట్టాయి. ప్రజలకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. అదే స్ఫూర్తితో హరితహారం కార్యక్రమాన్ని కొనసాగించేందుకు అధికారులు సిద్ధం అవుతున్నారు. పెద్దకొడప్‌గల్ మండలంలో హరితహారంలో భాగంగా ఈసారి లక్షా16వేల మొక్కలను నాటడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం తగిన ప్రణాళికలు సిద్ధం చేశారు.

**గ్రామాల్లో నర్సరీల ఏర్పాటు..**

మండలంలో మొత్తం 23 గ్రామ పంచాయతీలు ఉండగా.. ఒక్కో పంచాయతీ పరిధిలో నర్సరీని ఏర్పాటు చేశారు. ఒక్కో నర్సరీలో పది వేల మొక్కలు పెంచుతున్నారు. బేగంపూర్, కాస్లాబాద్, వడ్లం, అంజని, బుర్గుపల్లి, పోచారం, విఠల్‌వాడి, చిన్న తక్కడ్‌పల్లి, జగన్నాథ్‌పల్లి, శివాపూర్, కాటేపల్లి, సముందర్ తండా, టికారం తండా, పెద్ద దేవీసింగ్ తండా, లింగంపల్లి తదితర గ్రామాల్లో పంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలను పెంచుతున్నారు. నర్సరీలో మొక్కల పెంపకం బాధ్యతను గ్రామ పంచాయతీలకు అప్పగించారు. మొక్కల పెంపకాన్ని కార్యదర్శులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. నర్సరీల్లో ప్రధానంగా కానుగ, నిమ్మ, దానిమ్మ, జామ, సీతాఫలం, బొప్పాయి, పూలు, నీడనిచ్చే పలురకాల మొక్కలను పెంచుతున్నారు. మొక్కల సంరక్షణ బాధ్యతను వన సేవకులు చూసుకుంటున్నారు.



కుబ్యానాయక్ తండాలో నాటేందుకు సిద్ధంగా ఉన్న మొక్కలు

**ఉపాధి కూలీలకు పనులు..**

వర్షాలు కురియగానే.. మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈనెల చివరి వారం లేదా జూలై మొదటి వారంలో హరితహారం ప్రారంభం అవుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇందుకోసం ఉపాధి హామీ కూలీలతో గుంతలను తీయించి సిద్ధం చేస్తున్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రధాన రహదారులతోపాటు అంతర్గత రోడ్లకు ఇరువైపులా, ప్రభుత్వ ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ పాఠశాలలు, పంట పొలాలు, చెరువు కట్టలు, అటవీ భూముల్లో మొక్కలను నాటేందుకు గుంతలు తీస్తున్నారు. ప్రతి ఇంటికీ పూలు, పండ్ల మొక్కలను పంపిణీ చేయాలని అధికారులు ప్రణాళికలు రచించారు. మొక్కలను నాటడంతోపాటు రక్షించాలని ప్రజలకు వారు అవగాహన కల్పిస్తున్నారు.



నర్సరీలో పెరుగుతున్న మొక్కలు

**లక్ష్యాన్ని చేరుకుంటాం..**



మండలంలో మొక్కలు నాటే కార్యక్రమంలో అనుకున్న లక్ష్యాన్ని వందశాతం చేరుకుంటాం. మండలంలో అన్ని గ్రామాల్లో ఉన్న నర్సరీల్లో ఇప్పటికే నాటేందుకు మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి.

**- సూర్యకాంత్, ఎంపీడీవో**

## పిచ్చి మొక్కలు తొలగించండి సారూ..!

నాగిరెడ్డిపేట, జూన్ 9: మండలకేంద్రం గోపాల్‌పేటలో బోధన్ - హైదరాబాద్ ప్రధాన రహదారి పక్కన పోచారం ప్రధాన కాలువను ఆనుకొని 100కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఉన్నది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు, చెట్లు పెరిగాయి. సుమారు 15 ఏండ్ల క్రితం ఇక్కడ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటుచేశారు. ఏదైనా సమస్య వస్తే తప్ప అటు వైపు కనీసం కన్నెత్తి కూడా చూడడం లేదు. మొక్కలు ఏపుగా పెరగడంతో అది పాములకు నిలయంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లడానికి భయపడాల్సి వస్తుందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఇకనైనా విద్యుత్ శాఖ అధికారులు, గ్రామ పంచాయతీ సిబ్బంది స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లను తొలగించాలని వారు కోరుతున్నారు.

గోపాల్‌పేటలో ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు, చెట్లు



## వైభవంగా లక్ష్మమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠాపన

మద్నూర్, జూన్ 9: మండలంలోని సుల్తాన్‌పేట్ గ్రామంలో లక్ష్మమ్మ విగ్రహ పునఃప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఖత్‌గావ్ గ్రామానికి చెందిన మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాలకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. పూజల్లో గ్రామస్తులతోపాటు మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు

## పోచారం గ్రామంలో మద్య నిషేధం

**సహకరించాలని ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌కు గ్రామస్తుల విన్నపం**

నాగిరెడ్డిపేట, జూన్ 9: మండలంలోని పోచారం గ్రామంలో మద్యనిషేధించాలని గ్రామస్తులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ మేరకు తీర్మాన ప్రతిని ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌కు గ్రామస్తులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో కొందరు అక్రమంగా మద్యం అమ్మడంతో గ్రామస్తులు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. దీంతో అందరం కలిసి మద్యం అమ్మవద్దని తీర్మానించినట్లు తెలిపారు. ఇందుకు తమకు సహకరించాలని వారు సీఐని కోరారు. సీఐని కలిసిన వారిలో గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్, కమిటీ సభ్యులు యాదగిరిగౌడ్, కిరణ్, నందు, సంగమేశ్వర్, నర్సింహులు గౌడ్ తదితరులు ఉన్నారు.



సీఐ రవీందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోచారం గ్రామస్తులు

## 'ప్రజల్లో విశ్వాసం కోల్పోయిన కాంగ్రెస్'

ఎల్లారెడ్డి రూరల్, జూన్ 9: ఎల్లారెడ్డి నియోజకవర్గ ప్రజల్లో కాంగ్రెస్ పార్టీ విశ్వాసం కోల్పోయిందని బీజేపీ నాయకుడు, శాస్త్రవేత్త పైడి ఎల్లారెడ్డి అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్లారెడ్డి నియోజవకర్గంలో బీజేపీకి మెజారిటీ రావడంతో తమపై బాధ్యత పెరిగిందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తామని తెలిపారు. సమావేశంలో నాయకులు రాజ్‌దాస్, పెద్దెడ్ల నర్సింహులు, నక్కగంగాధర్, ఆకుల కిష్టయ్య, సతీశ్, వంగపల్లి కాశీనాథ్, వంజరి గణేశ్, గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో గేదె మృతి

గాంధారి, జూన్ 9: విద్యుత్ షాక్ తగిలి గేదె మృతిచెందిన ఘటన మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో చోటుచేసుకున్నది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కాయితి సావిత్రికి చెందిన గేదె శనివారం జంగిడిలో గ్రామ శివారులోని పంటపొలాల్లోకి మేత మేసేందుకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వస్తూ.. గ్రామ శివారులో ఉన్న పంట పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లింది. విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. మృతిచెందిన గేదె విలువ రూ.80వేల వరకు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. తమ కుటుంబానికి ఆసరాగా ఉన్న పాడి గేదె మృతిచెందడంతో తీవ్రంగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితురాలు కోరుతున్నది.